# బిడియం

**శా**రద బి.ఎ. పాసయినప్పటికీ చాలామంచిది. అంటే ఆమె ఎన్నడూ అవినీతిగా ప్రవర్తించి ఎరగదు. ఆమె మనస్సు పరపురుషులమీద పోలేదని కాదు. ఒక్కోసారి తన ఒంట్లో ఉన్న నరనరమూ ఒక్కో పరపురుషుడి కోసం పీకేది... కాని ఆ నరాల పీకుడు కార్యరూపం ధరించలేదు. భగవంతుడు తన శీలాన్ని కాపాడుతూ వచ్చాడు. తన ప్రేమకు తాత్కాలికంగా పాత్రులు కావచ్చిన మగవాళ్లెప్పటికప్పుడు తన మనస్సులోంచి రాలిపోయినారు.

అయితే శారద భర్త కూడా ఆ పరాయి వాళ్లతోపాటు ఎన్నడో ఆమె మనస్సులోంచి రాలిపోయినాడు...

అయితే ఆమెకిప్పుడు సందేహం పట్టుకుంది. తను పరపురుషుడి మొహం ఎరక్కుండా చావటం చాలా గర్వపడ్డదగ్గ విషయమా? లేక రహస్యంగా సిగ్గుపడదగ్గ విషయమా? ఈ విషయం తేల్చుకోవలసిన అవసరం కలిగింది శారదకు. పై ప్రశ్నకు వచ్చే సమాధానం మీద ఆమె ప్రవర్తన ఆధారపడబోతున్నది.

ఎందుకంటే, ఆ కుర్రాడు, శాస్త్రి. తనను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఏమీ సందేహం లేదు. పదిహేడేళ్ల కుర్రాడు. కాస్త నలిగిన అందాన్ని మాత్రమే చూడగల్డు! అంచేత వాళ్ల మనస్సు ఇరవై ఏడేళ్ల స్త్రీ మీద పోతుంది.

తనకు శాస్త్రి మీద మనస్సుపోయిందని కాదు. ఎబ్బే! పాపం, పసివాడు; పాలుగారే మొహమూ. తియ్యని పెదిమలూ, తడి కళ్లూ, రాని మీసాలూ, కళ్లమీద పడే క్రాపూ, సన్నని నడుమూ... ఛీ! ఛీ! తనకా అబ్బాయిమీద భ్రమ ఎందుకుంటుందీ?

కానీ ఆ కుర్రాడి స్వర్గసౌఖ్యం తన అరచేతిలో ఉంటే అది అతనికివ్వటం ఉచితమా, కాదా? తన ధర్మమా, కాదా? బి.ఎ. పాసయిన తనకు నిరపాయకరమైన ఒక చిన్నతప్పు చేసే అధికారం లేదా? ఒకవేళ తను ఆ కుర్రాణ్ని విరహాగ్ని వాతవేసి తను పదహారణాల పాతివ్రత్యం దక్కించుకున్నప్పటికీ, ప్రపంచం తన పదహారణాల పాతివ్రత్యంలో విశ్వాసం ఉంచుతుందనే ఆశ ఉన్నదా?

"ఏమిటి, శాస్త్రీ. ఏదో అనబోయినావే! నేనేమీ అనుకోనులే చెప్పు!" అన్నది శారద ప్రోత్సాహకరంగా నవ్వుతూ.

అయిదు నిమిషాల నించీ నీళ్లు నములుతున్న శాస్త్రి పెదిమలు నాక్కుని అధిక సాహసంతో నోరు విప్పాడు -

"ఈ నెల ఇంతవరూ మా నాన్న డబ్బు పంపలేదు. పదిహేను రూపాయలు కావాలి. అడగటానికి సిగ్గుగా ఉంది."

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***
***యువ కార్యాలయం, తెనాలి***